నిరుద్యోగులకు కాంగ్రెస్ బాసటగా నిలవాలి



మాట్లాడుతున్న న్యాయవాది రాపోలు భాస్కర్ నేత

సైదాబాద్: పదేళ్లుగా పలు ఇబ్బందులకు గురౌతున్న రాష్ట్రంలోని నిరుద్యోగులకు నూతన కాంగ్రెస్ ప్రభుత్వం బాసటగా నిలవాలని ప్రముఖ హైకోర్టు అడ్వకేట్ రాపోలు భాస్కర్ నేత కోరారు. సోమవారం ఆయన పలువురు పోలీసు ఉద్యోగాల అభ్యర్థులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులను ప్రక్షాళన చేసిన తరువాతే ఉద్యోగ నియామక పరీక్షలు నిర్వహించాలన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధం లేని జీఓనెం 57, 58లను ప్రభుత్వం రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ వేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆయన కోరారు.

నేడు చలో ప్రజాభవన్...

పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ.. మంగళవారం చలో ప్రజాభవన్ నిర్వహిస్తున్నామని పోలీస్ ఉద్యోగ అభ్యర్థుల ప్రతినిధి యాసం ప్రదీప్ తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ఉద్యోగార్థులు మంగళవారం ఉదయం ప్రజాభవన్‌కు చేరుకుంటారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అభ్యర్థులమంతా తమ వినతి పత్రం అందజేస్తామన్నారు. నర్సింహ, రాజు, పరుశురాం, కోటేష్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను ఆదుకోవాలి



సంఘీభావం తెలియజేస్తున్న జోగు రాములు

దిల్‌సుఖ్‌నగర్: వీధి వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని, తమకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కొత్తపేటలోని వీధి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కొత్తపేటలో రోడ్డు మీద వీధి వ్యాపారాలు చేసుకుంటున్న పండ్ల బండ్లను ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసులు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఎస్సీసెల్ చైర్మన్ జోగు రాములు కొత్తపేట చేరుకుని వీధి వ్యాపారులకు సంఘీభావం ప్రకటించారు. వీధి వ్యాపారులు మాట్లాడుతూ.. తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని, బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి 20 ఏళ్లుగా పండ్లు అమ్ముకుంటున్నామన్నారు. మార్కెట్‌ను తరలించడంతో కొత్తపేటలో వ్యాపారం నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. జోగు రాములు మాట్లాడుతూ.. ఈ సమస్యను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారన్నారు. కొత్తపేట వీధి వ్యాపారులు ప్రదీప్, బాబు, గణేష్, షేర్ఖిన్, అర్మార్, అనిల్, శంషుద్దీన్ తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సింగరేణి కాలనీలో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సింగరేణి కాలనీ రోడ్‌నెం 14లో కొద్దిరోజులుగా డ్రైనేజీలు పొంగి, మురుగు రహదారులపై పారుతుందని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యను వాటర్‌వర్క్స్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌లు వేయిస్తున్నామన్నారు. డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షిస్తుండాలని కార్పొరేటర్ సూచించారు. అజయ్‌రెడ్డి, నేతాజీ, బాలు, సురేష్, రమేష్, పవన్, సిద్దు, శాంతిబాయ్, శ్రీను పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులపై సమీక్ష

- త్వరితగతిన పూర్తి చేయాలి
- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతరెడ్డి



బడంగ్‌పేటలో పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాతరెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం మేయర్ చిగురింత పారిజాతరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని 22, 23 డివిజన్ల పరిధిలో పనులు కొనసాగుతున్నాయి. అనంతరం మేయర్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారు, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కమిషనర్ సుమన్‌రావు, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, ఈఈ కృష్ణయ్య, డీఈఈలు జ్యోతిరెడ్డి, అనురాధ, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, అర్జున్, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇంద్రసేనా, ఏఈఈలు వివేకనందసాగర్, రాజు, వినీల్‌గౌడ్, అవినాశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

రామంతాపూర్: డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు సోమవారం విద్యుత్ విభాగం డీఈ సూర్యనారాయణ, భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్, రామంతాపూర్ ఏఈ రాములును విద్యుత్ కార్యాలయంలో కలిసి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు విద్యుత్ సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. భగాయత్ కాలనీలతో పాటు శ్రీనగర్ కాలనీ, వివేక్‌నగర్‌లలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు సమస్య చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉందని, అదేవిధంగా ఇందిరానగర్, నెహ్రూనగర్, శారదానగర్ తదితర కాలనీల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, అందుకు తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యునికి చేయూత

- గాయపడ్డ వ్యక్తికి చికిత్స అందజేత



సూరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తున్న సలీం

హుడాకాంప్లెక్స్: హైదరాబాద్ లాంటి మహానగరంలో సగటు మానవుడు జీవించడం అనేక సవాళ్లతో కూడిన అంశం. అలాంటిది రోడ్లపై భిక్షాటన చేస్తూ పొట్ట నింపుకొనే బిచ్చగాళ్ల పరిస్థితి గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. సరూర్‌నగర్ మండల కేంద్రంలోని కొత్తపేట చౌరస్తాలో ఆకలి తీర్చుకునేందుకు సూరి భిక్షాటన చేసేవాడు. మూడు నెలల క్రితం భిక్షాటన చేస్తున్న సందర్భంలో గుర్తు తెలియని వాహనం అతనిని ఢీకొనగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు మొహమ్మద్ సలీం మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి 108కి కాల్ చేసి సూరిని ఉస్మానియా హాస్పిటల్‌కు తీసుకెళ్లి దగ్గరుండి వైద్యం చేయించాడు. మానవతా దృక్పథంతో స్పందించిన సలీంను స్థానికులు అభినందిస్తున్నారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారం

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో నెలకొన్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. స్థానికంగా నెలకొన్న కలుషిత నీటి సమస్యతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్పొరేటర్ జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జలమండలి బర్కత్‌పుర సెక్షన్ మేనేజర్ ఏఈ భావన క్యూఐడబ్ల్యూపీఎస్ కెమెరా మిషన్ ద్వారా నల్లాల్లో నీరు కలుషితం అవుతున్న ప్రాంతాన్ని సోమవారం గుర్తించారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ నేతలు సంతోష్, బి.భీమ్ రాజ్, కృష్ణ, సత్యనారాయణ, రవియాదవ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దల అనుభవాలు సమాజానికి ఉపయోగకరం



మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

మన్సూరాబాద్: పెద్దల అనుభవాలు నేటి సమాజానికి ఎంతో ఉపయోగం, ఆదర్శమని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవాన్ని మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీ సంక్షేమ సంఘం భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఇండోర్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజెన్స్ వివిధ రంగాల్లో విశేష సేవలు అందించి పదవీవిరమణ పొందారన్నారు. వారి జీవిత అనుభవాలు, సంస్కృతి సంప్రదాయాలు తదితర అంశాలు వారి నుంచి నేర్చుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. సీనియర్ సిటిజన్లు యువకులకు దీటుగా ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. మధుసూదన్‌రావు, ప్రతాప్‌రెడ్డి, యోగీంధర్‌రెడ్డి, రఘునాథ్, పాషా, సోమిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేమారెడ్డి, డీవీఎస్ శాస్త్రి, కొత్త రవి తదితరులున్నారు.

వేగంగా అభివృద్ధి చేసుకుందాం

- పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా..
- కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: కొన్ని సంవత్సరాలుగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభివృద్ధికి, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం జెండా మోసి పార్టీ గెలుపు కోసం శ్రమించిన వారికే పార్టీ పదవులు దక్కుతాయని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ ఏ బ్లాక్ పరిధిలో పోలైన ఓట్ల శాతంపై ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి పరమేశ్వర్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు, నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి, పార్టీ శ్రేణులు తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రణయ్‌రాజ్‌కు ప్రథమస్థానం



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రణయ్‌రాజ్

బోడుప్పల్: మేడ్చల్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన జొన్నపల్లి ప్రణయ్ రాజ్ ప్రథమ స్థానంలో నిలిచారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని ఈ ఫిట్‌నెస్ స్టూడియో జిమ్‌లో పోటీలను నిర్వహించారు. ప్రణయ్‌రాజ్ డెడ్ లిఫ్ట్‌లో 130 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 60 కేజీలను ఎత్తి ఈ విజయం సాధించారు. బోడుప్పల్ ద్వారకానగర్‌లోని స్లిమ్ లయన్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ అశోక్ వద్ద శిక్షణ పొందినట్లు ప్రణయ్‌రాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా కోచ్ అశోక్ మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్ 2023లో విజయం సాధించిన ప్రణయ్‌రాజ్ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కఠోరమైన శిక్షణ, సూచనలు, సలహాలు, మెళకువలతో ఈ విజయం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చరిత్ర ఆద్యంతం అవినీతిమయం

- బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు
- డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: ఝార్ఖండ్ ఎంపీ ధీరజ్ సాహూ ఇంటిపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు జరిపిన సోదాల్లో 290 కోట్ల రూపాయల అక్రమ సొమ్ము స్వాధీనం చేసుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అవినీతి చరిత్ర బహిర్గతమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఘటన ద్వారా అవినీతి, అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ పుట్టి అనే విషయం మరోసారి రుజువైందన్నారు. కాంగ్రెస్‌కు అవినీతికి వీడదీయలేని బంధం ఉందన్నారు. యూపీఏ హయాంలో రూ. లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలు చోటు చేసుకున్నాయని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలో అవినీతి ఉక్కుపాదంతో అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటుంటే... అవినీతి ఊబిలో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తోందన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు..

కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమ చర్యలను నిరసిస్తూ ఈ నెల 12న (మంగళవారం) జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

కాచిగూడ: ఆర్టికల్ 370పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేంద్రంలోని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వానికి ఒక గొప్ప కలికి తురాయి అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. సోమవారం కాచిగూడలోని తన నివాసంలో గీతామూర్తి మాట్లాడుతూ... దేశంలో ఉన్న 23 మంది ప్రముఖ లాయర్ల వాదనతో ఏకీభవించిన సుప్రీం కోర్టు సరైన తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370పై కేంద్ర నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. భారత దేశంలో కశ్మీర్ విలీనమైనప్పుడు ప్రత్యేక హోదాలేవీ లేవని, కశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదని కోర్టు చెప్పిందని గీతామూర్తి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు సమర్థిస్తూ దేశంలో మిగిలిన రాష్ట్రాలతో జమ్ము కశ్మీర్ సమానమని, ఆర్టికల్ రద్దు వెనుకెలాంటి దురుద్దేశం లేదని జడ్జీలు పేర్కొన్నారని గీతామూర్తి చెప్పారు.

తీర్పును స్వాగతిస్తున్నాం..

ఆర్టికల్ 370పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్ కొండ సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నుంచి జమ్మూ కశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడులు మనం కనులారా చూశామని, ఎప్పుడు చూసినా ఏదో ఒక గొడవలు జరుగుతూనే ఉండేవని అన్నారు. గొడవలను ఆపా లని కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన 370 ఆర్టికల్ బిల్లును సుప్రీం కోర్టులో రాజ్యాంగ పరంగా మద్దతిచ్చిన తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని అన్నారు. ఏబీవీపీ నేతలు సాయి తేజ, మహేందర్, రోహన్, ప్రేమ్, మణి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట రూ.19, వంకాయ రూ.35, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, కాకరకాయ 45, బీరకాయ 55, క్యాబేజి 15, ఫ్రెంచ్‌బీన్స్ 55, క్యారెట్ 37, దొండకాయ 35–40, చిక్కుడు 23–55, గోకరకాయ 50, బీట్‌రూట్ 33, క్యాప్సికం 55, ఆలుగడ్డ 23, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ 13, ఉల్లిగడ్డ 38, చామగడ్డ రూ.40గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న జయరాజ్ బెంజిమిన్

మలక్‌పేట: క్రైస్తవులకు అండగా నిలబడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని మలక్‌పేట మజ్లిస్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. క్రిస్టియన్ నేత జనంపల్లి జయరాజ్ బెంజిమిన్ ఆధ్వర్యంలో సోమవారం పంజేషాహ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. నాల్గోసారి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బలాలను శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనిల్‌కుమార్, యేసుపాదం, రాజశేఖర్, లక్ష్మణ్, అనిల్ ఆండ్రూస్ తదితరులున్నారు.

తాజుద్దీన్ బాబా దర్గాలో మొక్కుల చెల్లింపు



తాజుద్దీన్ బాబా దర్గా వద్ద బీఆర్ఎస్ నేతలు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేగా మూడోసారి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని కామేశ్వర కాలనీ మైనార్టీలు సోమవారం నాగపూర్‌లోని తాజుద్దీన్ బాబా దర్గాలో మొక్కులు చెల్లించారు. ఎన్నికల ముందు సుధీర్‌రెడ్డి గెలిస్తే మైనార్టీలు మొక్కులు చెల్లిస్తానని, మొక్కుకున్నామని అందుకే గెలిచిన సందర్భంగా మొక్కులు చెల్లించామని తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగోలు రజక సంఘం నాయకులు

నాగోలు : ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగోలు రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి మహేందర్, బొడ్డుపల్లి మధు ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యే గెలుపొందిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సీనియర్ రజక సంఘం నాయకులు చుక్కయ్య, సహదేవ్, కార్తీక్, సంజీవ్‌కుమార్, భరత్‌కుమార్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలని కూడలిలో ఏర్పాటు చేసిన మద్యంషాపును మరో ప్రాంతానికి తరలించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఎల్‌బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు గువ్వల సాయి రామకృష్ణ, ఇన్‌చార్జ్ పావురాల అశోక్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మేమునూరి సంపత్‌లు ఉప్పల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జైపురికాలనీలో మద్యంషాపును ఏర్పాటు చేయడంతో మహిళలకు చిన్న పిల్లలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అక్కడి నుంచి తొలగింపజేయాలని కోరారు. బీఎస్పీ నాయకులు జనగే విష్ణు, మేకల లక్ష్మణ్ తదితరులున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు కాలనీలలో ఫాగింగ్ నిర్వహించాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం డివిజన్ వార్డు కార్యాలయంలో ఎంటామాలజిస్ట్ ఏఈ మణెమ్మ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫాగింగ్ విషయంలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. సరూర్‌నగర్ చెరువుకు సమీపంలో ఉన్న ప్రతి కాలనీలలో రోజూ ఫాగింగ్ నిర్వహించాలని, లార్వా పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

నాగోలు : మతిస్థిమితం సరిగ్గా లేని దివ్యాంగ యువకుడు అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలోని కేకే గార్డెన్స్ వద్ద నివసించే శ్రీనివాస్ కుమారుడు చందరాము(28)కు మతిస్థిమితం సరిగ్గా లేదు, దివ్యాంగుడు. గత నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా.. ప్రయోజనం లేకపోవడంతో తండ్రి శ్రీనివాస్ ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తుతో పాడి సం'క్షేమం'



పాడి పశువులు

- శీతాకాలంలో జాగ్రత్తలు పాటించాలి
- వెచ్చదనం కల్పిస్తేనే అధిక పాల ఉత్పత్తి
- డా.విశ్వేశ్వర్ పశువైద్యాధికారి

మహేశ్వరం: రోజు రోజుకి చలి తీవ్రత విపరీతమవుతోంది. ఎముకల కొరికే చల్లని వాతావరణంతో నిత్యం ప్రజలు సావాసం చేస్తున్నారు. ఈ తరుణంలో పాడి పశువులు సైతం విలవిలలాడుతున్నాయి. ఇవి శీతాకాలంలో వ్యాధుల బారిన పడే ఆస్కారం ఎక్కువ ఉంది. పశువుల్లో వీలైనంత ఉత్పత్తి సామర్థ్యం రాబట్టాలంటే వాటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. శీతల గాలుల వల్ల వాటి జీర్ణ ప్రక్రియ మందగించి ఆహారం తీసుకోవడం తగ్గుతుందని దుబ్బచర్ల పశువైద్యాధికారి విశ్వేశ్వర్ తెలిపారు. ఈ సీజన్‌లో పశువుల్లో వచ్చే అనారోగ్య లక్షణాలను గుర్తించి, త్వరగా చికిత్సలు చేయించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

శ్వాసకోశ వ్యాధులు..

- చలి కాలంలో తక్కువ ఉష్ణోగ్రత వల్ల నిమోకాక్సై సూక్ష్మజీవులు ఊపిరితిత్తులపై ప్రభావం చూపి శ్వాసకోశ వ్యాధులకు గురి చేస్తుంటాయి. దీంతో ఊపిరితిత్తుల పొర వాపునకు గురై శ్వాసక్రియలో మార్పులు వస్తాయి. దీనికి వ్యాధి నిరోధక మందులు మేతలో కలిపి ఇవ్వాలి.
- ఈ సీజన్‌లో ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. పాడి పశువులకిచ్చే సమీకృత ఆహారంలో పాస్ఫేట్ సమృద్ధిగా లభించే తవుడును కలిపిన దాణాను ఇవ్వాలి. పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి.
- పశువులను పెంచే స్థలాలు శుభ్రంగా ఉండాలి. సరైన గాలి, వెలుతురు వచ్చే విధంగా మురికి నీరు నిలువ కాకుండా చేసుకోవాలి. వాతావరణంలో ఉండే ఉష్ణోగ్రతల కంటే పాకలలో ఎక్కువ ఉష్ణోగ్రత ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళలలో పశువులను ఆరుబయట కట్టేయకుండా షెడ్లలోనే ఉంచి ఇరువైపులా గోనే పట్టాలను వేలాడదీసి చలి తీవ్రత నుంచి రక్షణ కల్పించాలి. పాకలలో నేలపై రాత్రిపూట వరి గడ్డిని పరచాలి. పశువులు ఎక్కువగా ఉన్న రైతులు రూమ్ హీటర్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

టీకాలతో మేలు..

పశువులకు సోకే గొంతువాపు, గాలికుంటు తదితర అంటువ్యాధులు రాకముందే నివారణ చర్యగా వ్యాధినిరోధక టీకాలు వేయించడం మంచిది. శీతాకాలంలో వచ్చే పరాన్నజీవుల నిరోధక చర్యలు చేపట్టాలి. సర్వపరాన్న రోగ నిరోధక మందులు వాడాలి. ఆల్‌బెండల్ మందును వాడి జీర్ణ వ్యవస్థ ప్రక్రియను మందగించకుండా చూసుకోవాలి. పశువుల్లో అనారోగ్య లక్షణాలను ఎప్పటికప్పుడు గమనించాలి. పశువుల కళ్లు ఎర్రబడడం లేదా పుసులు కారడం, మేత తినకపోవడం, నెమరు వేయకపోవడం, పొట్ట కదలకుండా ఉబ్బరంగా ఉండటం, శరీరం వేడిగా, జ్వరంతో ఉండడం, పలుచటి పేడ వేయడం, వణకడం, దద్దుర్లు రావడం, పాల ఉత్పత్తి ఒకేసారి తగ్గిపోవడం, మూత్రం రంగు మారడం తదితర లక్షణాలు గమనించినట్లయితే వెంటనే పశువైద్యున్ని సంప్రదించాలి.

తగ్గుతున్న వ్యాధి నిరోధక శక్తి..



చలికాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి. అవి తీవ్ర ఒత్తిడికి గురి కాకుండా ఆరు బయట కట్టి వేయరాదు. ఈ కాలంలో పచ్చిమేత పెరుగుదల తక్కువగా ఉంటుంది. ఖనిజ లవణాలు, విటమిన్లు తగిన మోతాదులో లభించకపోవడంతో వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పశువులు వ్యాధుల బారినపడి నష్టం వాటిల్లుతుంది. దానికి నివారణగా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– డా.విశ్వేశ్వర్, పశువైద్యాధికారి, దుబ్బచర్ల